కాంగ్రెస్, బీజేపీ ఫ్లెక్సీలు కనిపించడం లేదా..?

● అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం

కూకట్‌పల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ అధికారులు కాంగ్రెస్, బీజేపీ ఫ్లెక్సీలు వదిలేసి బీఆర్‌ఎస్ పార్టీ ఫ్లెక్సీలు తొలగించడంలో అంతర్యమేంటని కూకట్‌పల్లి ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో కాంగ్రెస్, బీజేపీ ఫ్లెక్సీలు కనిపించడం లేదా అని ఆయన అధికారులను ప్రశ్నించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, మాజీ మంత్రి హరీశ్‌రావు పుట్టిన రోజును పురస్కరించుకుని పార్టీ నాయకులు, ఆయన అభిమానులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారన్నారని, ఆ ఫ్లెక్సీలను మున్సిపల్ అధికారులు తొలగించారని అన్నారు. కేసీఆర్ జన్మదినం రోజున కూడా బీఆర్‌ఎస్ ఫ్లెక్సీలు తొలగించారని, అధికారులకు బీఆర్‌ఎస్ ఫ్లెక్సీలు చూస్తే భయమెందుకని ఆయన ప్రశ్నించారు. జీహెచ్‌ఎంసీ నిబంధనలు అన్ని పార్టీలకు ఒకేలా ఉంటాయని, బీఆర్‌ఎస్ పార్టీ ఒకలా... కాంగ్రెస్, బీజేపీకి మరొలా ఉండవన్న విషయాన్ని అధికారులు గ్రహించాలన్నారు. ఇప్పటికైనా అధికారులు పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు.

కార్యకర్తలకు అండగా జనసేన

● పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి శంకర్‌గౌడ్



ప్రమాద బీమా చెక్కులను అందజేస్తున్న జనసేన రాష్ట్ర ఇన్‌చార్జి శంకర్‌గౌడ్

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు జనసేన ఎప్పుడూ అండగా ఉంటుందని పార్టీ ఇన్‌చార్జి నేమూరి శంకర్‌గౌడ్ అన్నారు. జనసేన పార్టీలో సభ్యత్వం తీసుకుని ఇటీవల ప్రమాదంలో మరణించిన బాన్సువాడ హరిసింగ్, గద్వాల్ జమున, హుజూర్‌నగర్ సైదులు కుటుంబసభ్యులకు రూ.5లక్షల బీమా చెక్కులను మంగళవారం కూకట్‌పల్లి కార్యాలయంలో అందజేశారు. కార్యకర్తల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ బీమా సౌకర్యం కల్పించారని శంకర్ అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముమ్మారెడ్డి ప్రేమకుమార్, ఆర్కే సాగర్, మండపాక కావ్య, రాజేశ్, శంకర్ పాల్గొన్నారు.

వీధి కుక్కల బెడద తప్పేదెన్నడు..?

● వీధుల్లోకి వెళ్లాలంటే జంకుతున్న జనం
● బాధితుల్లో పిల్లలు, వృద్ధులే ఎక్కువ
● పట్టించుకోని అధికారులు





కుక్కకాటుకు గురైన చిన్నారి (ఫైల్)

అల్లాపూర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కుక్కల బెడద ఎక్కువవుతోంది. కుక్కలు గుంపులు గుంపులుగా స్వైర విహారం చేస్తున్నాయి. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా దాడి చేస్తున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. వీధుల్లోకి వెళ్లాంటేనే జనం జంకుతున్నారు. ఎన్ని సార్లు జీహెచ్‌ఎంసీ స్త్రీ ఆనిమల్ విభాగానికి ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి వీధి కుక్కల బెడద నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

రోజుకోచోట..

అల్లాపూర్ డివిజన్‌లోని పర్వత్‌నగర్, శ్రీవివేకానంద నగర్, తులసీనగర్, జన ప్రియనగర్‌లలో వీధి కుక్కల బెడద ఎక్కువైంది. గుంపులు గుంపులుగా తిరుగుతూ దాడి చేస్తున్నాయి. రోజులో ఒక్క చోటైనా కుక్క కాటు వార్త వినాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలకు 30కి పైగా కుక్కకాటు కేసులు వస్తున్నాయని, ఇందులో చిన్న పిల్లలు, వృద్ధులే ఎక్కువగా ఉంటున్నారని వైద్యులు చెబుతున్నారు. పర్వత్‌నగర్, తులసినగర్, జనప్రియనగర్, హైటెక్‌సిటీ ఐటీ కారిడార్‌లో మహిళలు, పురుషులు ఎక్కువగా హౌస్ కీపింగ్, సెక్యూరిటీ ఉద్యోగాలు చేస్తుంటారు. ఉదయాన్నే వెళ్లి రాత్రి వేళల్లో వస్తుంటారు. వారు డ్యూటీకి వెళ్లే సమయాల్లో రోడ్లన్నీ నిర్మానుష్యంగా ఉంటాయి. అలాంటి ప్రాంతాల్లో కుక్కలు ఎక్కువగా ఉండడంతో వారంతా భిక్కుభిక్కుమంటూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. తక్షణమే అధికారులు స్పందించి కుక్కలకు స్టెరిలైజ్ చేసి వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులను వివరణ కోరగా కుక్కల నియంత్రణ అనేది ఒకేసారి కాదని, దానికి కాస్త సమయం పడుతుందని చెబుతున్నారు.

కుక్క కాటుకు చికిత్స తప్పనిసరి

కుక్కకాటు చికిత్స కోసం పీహెచ్‌సీకి వచ్చే వారి సంఖ్య అధికంగానే ఉంటుంది. కుక్కకాటుకు గురైన వారు వెంటనే గాయాన్ని సబ్బుతో కడుక్కోవాలి. గాయానికి ఎలాంటి కట్టు కట్టకూడదు. రేబీస్ వ్యాధి వచ్చే అవకాశం ఉన్నందున తప్పనిసరిగా ఆసుపత్రికి వచ్చి చికిత్స చేయించుకోవాలి. ఏఆర్‌వీ జీరో డోసు ఇంజెక్షన్ వేయించుకోవాలి. వైద్యుల సూచన మేరకు తదుపరి డోసులను షెడ్యూల్ ప్రకారం ఏఆర్‌వీ వేయించుకోవాలి.



- డా. షాలిని, మెడికల్ ఆఫీసర్, పర్వతనగర్ యూపీహెచ్‌సీ

జిల్లాలో వ్యాక్సిన్ కొరత

కుక్క కాటుకు గురవ్వగానే మొదట గుర్తుకు వచ్చేది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలే. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీలో యాంటి రేబీస్ టీకాల కొరత ఏర్పడింది. దీనిపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు వీధి కుక్కలను నియంత్రించరు.. మరో వైపు వ్యాక్సిన్ అందుబాటులో ఉంచరా అంటూ ప్రభుత్వంపై మండి పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి యాంటీ రేబిస్ టీకాలను అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

ఫ్రీలెఫ్ట్‌కు మార్గం సుగమం

● రోడ్డు మధ్యలో అడ్డంకిగా మారిన స్తంభం ● స్తంభం చుట్టూ ప్రహరీ నిర్మాణం ● రెండు రోజుల్లో అందుబాటులోకి



కొత్తగా అందుబాటులోకి రానున్న ఫ్రీ లెఫ్ట్ మార్గం ఇదే



33కేవీ స్తంభం చుట్టూ నిర్మించిన ప్రహరీ

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): హైటెక్‌సిటీ, జేఎన్‌టీయూ మీదుగా మియాపూర్ నుంచి జాతీయ రహదారి వైపుకు వెళ్లే వాహనదారులకు అధికారులు శుభవార్త అందించనున్నారు. ఎన్నో ఏళ్లుగా జేఎన్‌టీయూ వద్ద ఫ్రీ లెఫ్ట్ తీసుకునేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. సమస్యను సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ స్వయాన జీహెచ్‌ఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన జీహెచ్‌ఎంసీ కమిషనర్, జీహెచ్‌ఎంసీ మూసాపేట్ సర్కిల్ అధికారులు వాహనదారుల కష్టాలను దృష్టిలో పెట్టుకుని రెండు వారాల క్రితం పనులు ప్రారంభించారు. కొత్తగా ఫ్రీలెఫ్ట్ తీసుకునేందుకు 30 అడుగుల మేర రహదారిని అందుబాటులోకి తీసుకురానున్నారు. అయితే ఇక్కడ 33 కేవీ విద్యుత్ స్తంభం అడ్డుగా ఉంది. దీన్ని తొలగించేందుకు టెండర్లు పిలిచారు. అప్పటివరకు వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని దాని చుట్టూ ఆరు అడుగుల మేర ప్రహరీ నిర్మిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ, టీజీఎస్‌పీడీసీఎల్, ట్రాఫిక్ విభాగాలు సంయుక్తంగా పనిచేస్తే జేఎన్‌టీయూ వద్ద ఫ్రీ లెఫ్ట్‌కు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వాహనదారులు చెబుతున్నారు.

రెండు రోజుల్లో అందుబాటులోకి

అత్యంత రద్దీగా ఉండే జంక్షన్లలో జేఎన్‌టీయూ ఒకటి. ఇక్కడ ఫ్రీ లెఫ్ట్ తీసుకునేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వారి ఇబ్బందిని దృష్టిలో పెట్టుకుని సమస్య పరిష్కారానికి జేఎన్‌టీయూ వద్ద ఫ్రీ లెఫ్టను అభివృద్ధి చేస్తున్నాం. రెండు వారాల క్రితం కొత్త సీసీ రోడ్డు వేశాం. రెండు రోజుల్లో వాహనదారులకు అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నాం

- రమేశ్, ఈఈ, మూసాపేట్ సర్కిల్

ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

● మల్కాజ్‌గిరి ఎంపీ రాజేందర్



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎంపీ రాజేందర్

అల్లాపూర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి దయతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్టు మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ చెప్పారు. వివేకానందనగర్‌లో వేంకటేశ్వరస్వామి ఆలయ 13 వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో ఎంపీ ఈటల రాజేందర్ మంగళవారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ అర్చకులు ఎంపీని పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేపీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి కాంతారావు, కాలనీల సంక్షేమ సంఘం అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణమెప్పుడు?

● కార్పొరేటర్ శ్రీనివాసరావు



నిరసన వ్యక్తం చేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సర్కారు ఆసుపత్రిని ఎప్పుడు నిర్మిస్తారని స్థానిక కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ మేరకు బీఆర్‌ఎస్ నాయకులు, కాలనీల అసోసియేషన్ల సభ్యులతో కలిసి మంగళవారం కేపీహెచ్‌బీ ఐదోఫేజ్‌లో సర్కారు దవాఖానాకు కేటాయించిన స్థలంలో కార్పొరేటర్ నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కృష్ణారావు సహకారంతో రెండేళ్ల క్రితం హౌసింగ్‌బోర్డు లేఅవుట్‌లో 100 పడకల ఆసుపత్రికి 1.17ఎకరాల భూమి, రూ.36కోట్ల నిధులు కేటాయించి, హరీశ్‌రావు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. పేద ప్రజలపై ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్న తక్షణమే ప్రభుత్వం పనులు ప్రారంభించాలని కార్పొరేటర్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనగాం సురేశ్ రెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అథ్లెట్ నవ్యకు చేయూత

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): అల్ట్రా మారథాన్‌కు ఎంపికైన యువ అథ్లెట్ నవ్యకు బొటానికల్ గార్డెన్ వాకర్స్ అసోసియేషన్ రూ.1లక్ష ఆర్థికసాయం అందజేసింది. ఈ నెల 8న దక్షిణాఫ్రికాలో మారథాన్ జరగనుందని వారు తెలిపారు.

భూ భారతి చట్టం రైతుల చుట్టం

- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ
- గచ్చిబౌలిలో రెవెన్యూ సదస్సు నిర్వహణ
- 6 వరకు కొనసాగనున్న సదస్సులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

రాయదుర్గం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టం రైతుల భూములకు రక్షణ కవచం వంటిదని, భూమి ఉన్న ప్రతి రైతుకు భూభద్రత ఉంటుందని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. మంగళవారం గచ్చిబౌలి డివిజన్ గౌలిదొడ్డిలోని వార్డు కార్యాలయంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో డిప్యూటీ కలెక్టర్, తహశీల్దార్ వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యే గాంధీ కార్పొరేటర్లు గంగాధర్ రెడ్డి, రాగం నాగేందర్‌యాదవ్, నార్నె శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. భూ భారతి కొత్త ఆర్ఓఆర్ చట్టమని, ఇందులో భాగంగా సమస్యలకు సత్వర పరిష్కారం ఉంటుందన్నారు. రైతుల మేలుకోసం ప్రజా పాలనలో చారిత్రక మార్పు తీసుకొచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. భూ భారతి చట్టం రైతుల చుట్టమన్నారు. ఈ చట్టంతో హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం భూధార్ కార్డులు జారీ చేస్తుందని, రైతులకు ఉచిత న్యాయ సహాయం చేసే విధంగా వెసులుబాటు కల్పిస్తుందని చెప్పారు.

ఈ ప్రాంతాల్లో రెవెన్యూ సదస్సులు

ఈ నెల 6వ తేదీ వరకు వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని, ఉదయం 10 గంటలకు నిర్దేశిత ప్రాంతాల్లో సదస్సులు ప్రారంభమవుతాయని ఆయన వెల్లడించారు. 4వ తేదీ ఉదయం 10గంటలకు రాయదుర్గం కల్సా, రాయదుర్గం పాన్‌మక్తా, రాయదుర్గంపైగా, దర్గాహుస్సేన్, ఖాజాగూడ గ్రామాలకు సంబంధించి దర్గా హుస్సేన్ షావలిలోని వార్డు కార్యాలయంలో.. మియాపూర్, రామన్నగూడ, మక్తామహబూబ్‌పేట గ్రామాలకు సంబంధించి మియాపూర్‌లోని మయూరినగర్ వార్డు కార్యాలయంలో సదస్సులు ఉంటాయని చెప్పారు. అదేవిధంగా 5వ తేదీ శేరిలింగంపల్లి, కొండాపూర్, గచ్చిబౌలి, కంచ గచ్చిబౌలి గ్రామాలకు సంబంధించి గచ్చిబౌలిలోని అంజయ్యనగర్ వార్డు కార్యాలయం, 6వ తేదీ హఫీజ్‌పేట, కొత్తగూడ, మదీనగూడ, హఫీజ్‌పేట డివిజన్ ఓల్డ్‌హఫీజ్‌పేటలోని వార్డు కార్యాలయంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది ఆర్ఐ చంద్రారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్

నేడు ఐఐటీ హైదరాబాద్‌లో జేఈఈ ఓపెన్ డే

- ఐఐటీ ఆశావహుల సందేహాలను నివృత్తి చేసుకునేందుకు అవకాశం

కంది, జూన్ 3(ఆంధ్రజ్యోతి): జేఈఈ (జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్)లో మంచి ర్యాంకు సాధించి ఐఐటీలలో సీటు పొందాలని ఆశపడే విద్యార్థులకు సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో బుధవారం జేఈఈ ఓపెన్ డే-2025 కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించి మంగళవారం ఐఐటీ హైదరాబాద్ అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు. జేఈఈలో మంచి ర్యాంకు వచ్చి ఇంజనీరింగ్, దాని తర్వాత ఏం చేయాలనే సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవడానికి ఆహ్వానం పలుకుతున్నారు. ఇందులో భాగంగానే బుధవారం ఐఐటీహెచ్ ప్రాంగణంలోని లెక్చరర్స్‌హాల్ కాంప్లెక్స్‌లో ఉదయం 10 గంటల నుంచి ఆఫ్‌లైన్ సెషన్‌లో ప్రత్యక్షంగా జేఈఈ ర్యాంకర్స్‌తో మాట్లాడనున్నారు. ఐఐటీలలో చదవాలనుకునే ఆశావాహులకు ఐఐటీలలో ఎందుకు చదవాలి, ప్లేస్‌మెంట్స్ ఎలా ఉంటాయి, ఇంటర్న్‌షిప్‌లు, వినూత్న అవకాశాలు, క్యాంపస్ లైఫ్, ఆవిష్కరణలు, సాంకేతికతలపై ఉన్న అనుమానాలను తీర్చనున్నారు. అలాగే ఈ నెల 5న గురువారం ఉదయం 10 గంటల నుంచి ఐఐటీహెచ్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ మోడ్‌లో కూడా ఇదే సెషన్‌ను నిర్వహించనున్నారు. మరిన్ని వివరాలకు ఐఐటీహెచ్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఐఐటీ హైదరాబాద్ అధికారులు తెలిపారు.



అంజయ్యనగర్ పర్యటనలో కార్పొరేటర్ అమీద్ పటేల్, ఎంటమాలజీ అధికారులు

వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గచ్చిబౌలి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, తమ పరిసరాలను ప్రజలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కార్పొరేటర్ షేక్ అమీద్ పటేల్ సూచించారు. మంగళవారం కొండాపూర్ డివిజన్ పరిధిలోని అంజయ్యనగర్, సిద్దిఖీనగర్‌లలో ఆయన పర్యటించారు. ఇంటింటికి వెళ్లి దోమల నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా ప్రకటించుకొని తమ ఇంటిని, పరిసరాలను ప్రజలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెత్తాచెదారం, వర్షపు నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమల నివారణ కోసం కొన్ని రకాల మొక్కలు కూడా ఉన్నాయని, అలాంటి వాటిని తమ ఇళ్లలో నాటుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంటమాలజీ ఏఈ తనూజ, సూపర్‌వైజర్ లత, శానిటేషన్ సూపర్‌వైజర్ కిరణ్ కుమార్ రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టులకు కేటాయించిన స్థలం కబ్జాకు యత్నం



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

చందానగర్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి జర్నలిస్టులకు చందానగర్‌లో కేటాయించిన స్థలాన్ని కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. స్థలంలో ఏర్పాటు చేసిన కంచెను తొలగించి విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. శేరిలింగంపల్లిలో పనిచేస్తున్న జర్నలిస్టుల కోసం ప్రభుత్వం రెండేళ్ల క్రితం చందానగర్ సర్వే నంబర్ 174లో ఎకరం స్థలం కేటాయించింది. అందులో రెండు పడకల ఇళ్లు నిర్మించి ఇవ్వాలని జీహెచ్ఎంసీకి అప్పగించింది. అయితే కొందరు వ్యక్తులు సోమవారం స్థలంలోకి చొరబడ్డారు. పలువురు జర్నలిస్టులు కబ్జా చేస్తున్న దృశ్యాలను చిత్రీకరిస్తుండగా వారిని చంపేస్తామంటూ బెదిరింపులకు దిగారు. దీంతో కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు పోలీసులను ఆశ్రయించారు. మరోవైపు స్థలాన్ని కాపాడాలని జర్నలిస్టుల సంఘాల నాయకులు సలీం పాషా, శేఖర్‌సాగర్, కొండ విజయ్‌కుమార్, రమేష్‌సాగర్, విఠల్ రెడ్డి, మాధవరెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌లతో పాటు మరికొందరు ఎమ్మెల్యే గాంధీ, చందానగర్ ఉపకమిషనర్ మోహన్‌రెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. స్థలాన్ని పరిశీలించిన విద్యుత్ అధికారులు అక్కడ ఏర్పాటు చేసిన స్తంభాలను తొలగించారు.



మండపారాధన కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు

సరస్వతి దేవి ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం

భెల్‌కాలనీ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): భెల్ టౌన్‌షిప్‌లోని జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో 18వ అష్టాదశ వార్షికోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, సరస్వతి దేవికి విశేష అభిషేకం, దీక్షాధారణ, నూతన వస్త్రాలంకరణ చేపట్టారు. సాయంత్రం దీక్షాధారణ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, పంచగవ్య ప్రాశన, యాగశాల ప్రవేశం, సరస్వతి మూలమంత్ర హోమం తదితర పూజలు జరిగాయి. దేవాలయ అర్చకుడు భీమలింగం ఆధ్వర్యంలో జరుగుతున్న వార్షికోత్సవాల్లో ఆలయ కార్యవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



గచ్చిబౌలి నుంచి హెచ్‌సీయూకు వెళ్లే రహదారిలో చెట్టును ఢీకొన్న వాహనం

చెట్టును ఢీకొన్న భారీ వాహనం

- ట్రాఫిక్ జామ్‌తో వాహనదారుల ఇక్కట్లు

హైదరాబాద్ సిటీ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వేగంగా వచ్చిన రెడీమిక్స్ కాంక్రీట్ వాహనం చెట్టును బలంగా ఢీకొట్టి రోడ్డుపై నిలిచిపోయింది. దీంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు కొన్ని గంటల పాటు తీవ్ర ఇబ్బంది తలెత్తింది. గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం 7.30 గంటల సమయంలో గచ్చిబౌలి స్టేడియం దాటిన తర్వాత ఓ చెట్టును బలంగా ఢీకొని వాహనం రోడ్డుపై నిలిచిపోయింది. కాగా అందులో ఉన్న డ్రైవర్ స్వల్ప గాయాలతో బయపడగా, రోడ్డుపై ట్రాఫిక్ సమస్య తలెత్తింది. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీసులు ప్రమాదానికి గురైన రెడీమిక్స్ కాంక్రీట్ వాహనాన్ని పక్కకు తొలగించి ట్రాఫిక్ సాఫీగా వెళ్లేందుకు చర్యలు చేపట్టారు. భారీ వాహనాలు నగర రోడ్లపై తిరుగుతున్న సమయంలో వేగ నియంత్రణ పాటించాలని ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు. సైబరాబాద్ పరిధిలో అత్యధిక సంఖ్యలో భారీ వాహనాలు నడుస్తుంటాయని, ముఖ్యంగా నిర్మాణ రంగానికి సంబంధించిన వాహనాల రాకపోకలు అధికంగా ఉండడంతో తరచూ ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుని ట్రాఫిక్ ఇబ్బందులకు దారి తీస్తున్నాయి.

జువెనైల్ హోంకు చోరీలకు పాల్పడుతున్న బాలురు

మియాపూర్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్లు, వాహనాల చోరీకి పాల్పడుతున్న ఇద్దరు బాలురను మియాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకొని జువెనైల్ హోంకు తరలించారు. మియాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్‌లోని ఓ ఇంట్లో సెల్‌ఫోన్ చోరీకి గురికావడంతో బాధితులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారించగా ఇద్దరు బాలురు చోరీకి పాల్పడినట్లు అంగీకరించారు. కాగా, వీరిపై మియాపూర్, గచ్చిబౌలి, కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి.

క్రీడాకారులకు క్రమశిక్షణ అవసరం

గచ్చిబౌలి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు క్రమశిక్షణ ఉండాలని శిల్పా హోమ్స్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కొండాపూర్‌లోని ఏ జోన్ బ్యాడ్మింటన్ అకాడమీలో వికారాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి టోర్నమెంట్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి శ్రీనివాస్‌రెడ్డి అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.



నవ్యను అభినందిస్తున్న శివసేనారెడ్డి

అథ్లెట్ నవ్యకు చేయూత

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): అల్ట్రా మారథాన్ (90 కిలోమీటర్ల) పరుగుకు ఎంపికైన యువ అథ్లెట్ నవ్యకు బొటానికల్ గార్డెన్ వాకర్స్ అసోసియేషన్ రూ.1 లక్ష అందజేసింది. మంగళవారం గచ్చిబౌలి స్టేడియంలో శాట్ చైర్మన్ శివసేనారెడ్డి వాకర్స్ అసోసియేషన్ చెక్‌ను నవ్యకు అందించారు. ఈ నెల 8న దక్షిణాఫ్రికాలో ఈ మారథాన్ జరగనుంది. భరత్ రెడ్డి, బాలకిషన్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను కలిసిన నూతన సంక్షేమ సంఘం సభ్యులు

పార్టీలకు అతీతంగా బస్తీలను అభివృద్ధి చేసుకోవాలి

● ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

పేట్‌బషీరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా పని చేస్తూ బస్తీలను అభివృద్ధి చేసుకోవాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులకు సూచించారు. జగద్గిరిగుట్ట డివిజన్ అంజయ్యనగర్ సీ-బ్లాక్ నూతన సంక్షేమ సంఘం సభ్యులు ఎమ్మెల్యేను మంగళవారం జీడిమెట్ల డివిజన్ దండమూడి ఎన్‌క్లేవ్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నూతన కమిటీ సభ్యులంతా సమైక్యంగా ఉండి కాలనీలోని సమస్యలను పరిష్కరించుకోవాలని, కాలనీ అభివృద్ధికి పాటుపడాలని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు అశోక్, శ్రీ వేంకటేశ్వర దేవాలయం మాజీ చైర్మన్ వేణుయాదవ్, రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షుడు ఎ. మారయ్య, నూతన అధ్యక్షుడు ఎ. గురువయ్య, ఉపాధ్యక్షుడు పాండు, ప్రధాన కార్యదర్శి రాజుగౌడ్, కోశాధికారి అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

సైకిల్ సవారీతో మనస్సుకు ప్రశాంతత

దుండిగల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : స్థిరమైన రవాణాకు చిహ్నం, ప్రజల అవసరాలను తీర్చే సాధనం సైకిల్ అని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. ప్రపంచ సైక్లింగ్ దినోత్సవం సందర్భంగా శంభీపూర్‌లోని తన కార్యాలయ ఆవరణలో సైకిల్‌కు జాతీయ జెండా కట్టుకొని సైక్లింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉరుకుల పరుగుల జీవితంలో ప్రజలు తమ ఆరోగ్యాన్ని లెక్క చేయడం లేదని, రోజూ ఒక గంట సైకిల్ తొక్కితే శారీరక శ్రమ కలిగి మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు.



సైక్లింగ్ చేస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

ఆదమరిస్తే తప్పదు ప్రమాదం!

కుత్బుల్లాపూర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లోని చికెన్ మార్కెట్ రోడ్డులో ఓ మ్యాన్‌హోల్ ధ్వంసమై రోడ్డులోకి దిగిపోయింది. రాత్రి సమయంలో అటుగా వచ్చే వాహనదారులు ఆదమరిస్తే అందులో పడి ప్రమాదాలకు గురయ్యే అవకాశముంది. సంబంధిత అధికారులు మ్యాన్‌హోల్‌కు మరమ్మతు చేయించి ప్రమాదాలు జరుగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



భగత్‌సింగ్‌నగర్‌లో శిథిలమైన మ్యాన్‌హోల్

పారిశుధ్య నిర్వహణ అధ్వానం..

అనారోగ్యం పాలవుతున్న జనం

● పేరుకుపోతున్న చెత్తాచెదారం
● కంపుకొడుతున్న పరిసరాలు
● విజృంభిస్తున్న దోమలు, ఈగలు



పేరుకుపోయిన చెత్త

పేట్‌బషీరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా తయారు కావడంతో దుర్గంధం, దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. జీడిమెట్ల గ్రామంలోని పాత హనుమాన్ ఆలయం సమీపంలోని రహదారుల్లో చెత్త పేరుకపోయి కంపుకొడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

● చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తరలించాలని పారిశుధ్య సిబ్బందిని కోరినా పట్టించుకోవడం లేదని, దీంతో ఈగలు, దోమలు విజృంభించి అనారోగ్యం పాలవుతున్నామని వారు వాపోతున్నారు. ఆరోగ్య అధికారిణి పర్యవేక్షణ లోపం, శానిటేషన్ సూపర్‌వైజర్ నిర్లక్ష్యం కారణంగా పారిశుధ్య కార్మికులు విధులు సక్రమంగా నిర్వహించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తే తప్ప పారిశుధ్య వ్యవస్థ మెరుగుపడే అవకాశం లేదని వారంటున్నారు.

ఎప్పటికప్పుడు తరలించాలి



ఒకపక్క వర్షాలు కురుస్తున్నాయి. మంగళ శనివారాల్లో భక్తులు ఈ మార్గంలో నడుచుకుంటూ ఆలయానికి వెళ్తారు. రోజుల తరబడి చెత్తను తరలించకపోవడంతో కుప్పలా ఏర్పడింది. అందులో వ్యర్థాలను తినేందుకు పందులు, కుక్కలు పోటీ పడుతున్నాయి. ఈగలు, దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. బస్తీలు, కాలనీల్లోని చెత్తను ఎప్పటికప్పుడు తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- బేకు పాండు, స్థానికుడు



రంగారెడ్డినగర్‌వాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ విజయ్‌శేఖర్‌గౌడ్

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

పేట్‌బషీరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి పనుల్లో నాణ్యతా పరిణామాలు పాటించాలని రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ బి. విజయ్‌శేఖర్‌గౌడ్ అన్నారు. రంగారెడ్డినగర్‌లో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, డివిజన్‌లోని కాలనీల్లో డ్రైనేజీ వేసిన ప్రాంతాల్లో సీసీ రోడ్డులు వేయలేదని,మిగతా ప్రాంతాల్లో సీసీరోడ్లు పూర్తయ్యాయన్నారు. త్వరలోనే మిగిలిన పనులను పూర్తి చేస్తామని, సీసీ రోడ్డులు వేసే సమయంలో అధికారుల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని కోరారు. మున్సిపల్ డీఈ సాగర్, ఏఈ స్వాతి పలు కాలనీల నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్ల అద్దె బిల్లులు రాక అవస్థలు

● ఇంట్లోని వస్తువులు కుదువపెట్టి రెంట్ చెల్లిస్తున్న టీచర్లు
● 9 నెలలుగా ప్రభుత్వం నుంచి డబ్బు తిరిగి రాక మనోవేదన



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు (ఫైల్)

పేట్‌బషీరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన అద్దె బిల్లుల డబ్బు రాకపోవడంతో టీచర్లు ఇబ్బంది పడుతున్నారు. దీనికి తోడు కేంద్రాల్లో తాగు నీరు, టాయిలెట్స్ సౌకర్యం లేక చిన్నపిల్లలు, గర్భిణులు అవస్థలు పడుతున్నారు. కుత్బుల్లాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలు అత్యధికంగా అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఇప్పటికి తొమ్మిది నెలలు అద్దె బిల్లులు రాక అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లలను ఇంటి యజమానులు డబ్బుల కోసం వేధిస్తున్నట్టు తెలిసింది. 2024 ఏడాది సెప్టెంబర్ నుంచి 2025 మే నెల వరకూ ప్రభుత్వం నుంచి అద్దె బిల్లులు రాలేదని, అద్దెలు చెల్లించేందుకు తాము తమ ఇళ్లలోని వస్తువులను కుదువ పెట్టాల్సి వస్తోందని పలువురు అంగన్‌వాడీ టీచర్లు ఆరోపిస్తున్నారు. కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు పరిధిలో 311 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వీటిలో 277 కేంద్రాలు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. ప్రభుత్వం నెలనెలా అంగన్‌వాడీ కేంద్రాల అద్దెలను చెల్లించాలని పలువురు కోరుతున్నారు.



ఇరుకు రోడ్డులో రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు

ఇరుకు రోడ్డుతో ప్రమాదాలు

గాజులరామారం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గాజులరామారం డివిజన్‌లోని మల్లారెడ్డినగర్, ద్వారకానగర్ నుంచి రామ్‌కీ అపార్టుమెంట్ వరకు ఉన్న ప్రధాన రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఉదయం, సాయంత్రం వేళల్లో కూకట్‌పల్లి నుంచి మహాదేవపురం చౌరస్తా మీదుగా షాపూర్‌నగర్‌కు, షాపూర్‌నగర్ నుంచి కూకట్‌పల్లికి ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే, ఇరుకుగా ఉండే ఈ రోడ్డుపై ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయని ద్వారకానగర్‌వాసులు వాపోతున్నారు. దీనికి తోడు ఇరుకైన మూలమలుపు ఉండటం వల్ల భారీ వాహనం వెళ్లే సమయంలో ఇబ్బందిగా మారిందని, వాహనాలను రోడ్లపైనే నిలపాల్సి వస్తోందని వాహనదారులు చెప్తున్నారు. జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు రోడ్డు మధ్యలో ప్లాస్టిక్ డివైడర్స్ ఏర్పాటు చేశారు. అయితే, వాహనదారులు వాటిపై వెళ్లడంతో పూర్తిగా ధ్వంసమయ్యాయి. గాజులరామారం గ్రామ చౌరస్తాలో రోడ్డు విస్తరణ పనులను శరవేగంగా పూర్తి చేస్తున్న అధికారులు ఈ రోడ్డును కూడా విస్తరిస్తే ప్రమాదాలు తగ్గుతాయని సమీప బస్తీవాసులు కోరుతున్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా

రెవెన్యూ సదస్సులు షురూ

● రైతుల నుంచి దరఖాస్తులు తీసుకున్న అధికారులు



శంభీపూర్‌లో భూసమస్యలపై అధికారులకు దరఖాస్తులు అందజేస్తున్న రైతులు

దుండిగల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూభారతి చట్టం అమలులో భాగం మంగళవారం నుంచి అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు మొదలయ్యాయి. గండిమైసమ్మ, దుండిగల్ మండల పరిధిలోని దొమ్మర పోచంపల్లి, శంభీపూర్ గ్రామాల్లో ఆర్‌డీఓ శ్యామ్ ప్రకాష్, తహసీల్దార్ మతిన్‌లు మేడ్చల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి కలిసి సదస్సును ప్రారంభించారు. ఈ సదస్సులో రైతులకు సంబంధించిన ఆన్‌లైన్‌లో నమోదు కాని భూమి వివరాలను, అదే విధంగా పాత పాస్ పుస్తకంలో ఉన్న వివరాలతో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఇప్పటి వరకు భూములను కొనుగోలు చేసిన రైతులు ధరణిలో వారి వివరాలు లేని వారు, అమ్మిన రైతుల వివరాలు ధరణిలో నుంచి తొలగించే విధానం, చనిపోయిన వ్యక్తుల నుంచి కుటుంబ సభ్యులకు ఆ భూమిపై హక్కులు కల్పించడం, అదే తరహాలో పాస్ బుక్‌ల్లో తప్పుగా ముద్రించిన పేర్లను సరి చేసుకొనేందుకు ఈ సదస్సుల్లో దరఖాస్తు చేసుకొనేందుకు రైతులకు అవకాశం కల్పించారు. వీటిని పరిశీలించి, రెండు, మూడు రోజుల్లో కొన్నింటిని అధికారులు పరిష్కరిస్తారని ఆర్‌డీఓ తెలిపారు. అదే విధంగా ఇప్పటి వరకు భూమిని సాగు చేసుకుంటున్న రైతుల పేర్లు రికార్డుల్లో నమోదు కాకపోతే వాటిని కూడా సరి చేయడానికి ఆగస్టు 15 లోపు రెవెన్యూ బృందాలు భూముల వద్దకు వచ్చి పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటాయన్నారు. ఇలా ఉండగా, దొబ్బర పోచంపల్లిలోని సర్వేనెంబరు 335లో సన్మాసన వాటిక కోసం స్థలం కేటాయించాలని గ్రామస్తులు ఆర్‌డీఓ కు వినతిపత్రం అందజేశారు.